కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36(గురువారం)
కనిష్ఠం : 28

అనాథలను చేసి.. వెళ్లిపోయారు!



నాడు కాదు.. నేడు అనాథలమయ్యాం.. మమ్మల్ని అనాథలుగా వదిలేసి ఆయన మాత్రం వెళ్లిపోయారు.. ఇక మాకు దిక్కెవరు.. అంటూ అమలాపురం శ్రీకామాక్షీ పీఠం వద్ద వందలాది మంది కన్నీటి పర్యంతమయ్యారు. కామేశ మహర్షి భౌతికకాయం వద్ద బోరున విలపించారు.. ఆయన 300 మంది అనాథలను చేరదీశారు.. వారికి విద్యాబుద్ధులు చెప్పించారు.. వారిలో చాలా మందికి వివాహాలు కూడా చేశారు.. ఆ 300 మందికి ఆయనే పెద్ద దిక్కుగా మారారు.. ఆ పెద్ద దిక్కు ఆరిపోయింది.. ఆ 300 మంది అనాథలను చేసి వెళ్లిపోవడంతో కన్నీటితో నివాళులర్పించారు.. - వార్త 6లో



కామేశ మహర్షి

కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: ఎస్పీ

» ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటిన ఎస్పీ




మొక్క నాటి నీళ్లు పోస్తున్న జిల్లా ఎస్పీ బిందు మాధవ్

కాకినాడక్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాను కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో ఆయన ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు కాలుష్య రహిత, హరిత వాతవరణం అందించాలని, జిల్లాలో వాయు కాలుష్యాన్ని తగ్గించాలనే లక్ష్యంతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులందరూ భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్‌లు, కార్యాలయాల్లో ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



పేదింటి బాట!



పేదింటి కలత తీర్చేలా ప్రభుత్వం అడుగులు

నాడు 3.84 లక్షల మంది ఎంపిక..

ఉమ్మడి జిల్లాలో సొంతిళ్లు లేని 3.84 లక్షల మందిని పథకానికి ఎంపిక చేశారు. తొలివిడత కింద ఉమ్మడి జిల్లాలో 1.53 లక్షల మందిని గుర్తిం చారు.ఈ మేరకు 7,218 ఎకరాలు అవసరం కాగా 1,856 ఎకరాల ప్రభుత్వ భూమి అందు బాటులో ఉన్నట్టు గుర్తిం చారు. దీంతో 5,362 ఎకరాల ప్రైవేటు భూములను ఇళ్ల స్థలాలకు సేకరించారు.ఇందుకు ఏకంగా రూ.2,566 కోట్లు ఖర్చు చేశారు. నాడు ఒక్కో అధికార పార్టీ ఎమ్మెల్యే అప్పట్లో కోట్లలో మెక్కేశారు. ఎకరం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు ముందే కొనుగోలు చేసి అవే భూములను తమ పలు కుబడితో రూ.42 లక్షల చొప్పున ప్రభుత్వానికి అంటగట్టి జేబులు నింపేసుకున్నారు. ఇలా సేకరించిన ఇళ్లస్థలాలు అసలు ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేవని అప్పట్లో లబ్ధిదారులు పెదవి విరిచినా పట్టించుకోలేదు.ఒక్క కాకినాడ జిల్లాలోనే 359 లేఅవుట్లలో 77,896 ఇళ్లు నిర్మించి తీరాల్సిందేనని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. తూర్పు గోదావరి జిల్లాలో 321 లేఅవు ట్లలో 68 వేల ఇళ్లు కట్టించాలని భావించారు. లేఅవుట్లు ఏమాత్రం అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు అసలు కన్నెత్తి చూడలేదు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పేదల ఇంటి కల నెరవేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకెళుతోంది. ఈనెల 12వ తేదీకి జిల్లాలో చాలా మంది పేదల సొంతింటి కల నెరవేర్చి గృహ ప్రవేశాలు చేయించాలనే మంచి ఆలోచనతో అధికారులకు లక్ష్యాలను నిర్దేశించింది.సీఎం చంద్రబాబు పేదల ఇళ్ల నిర్మాణ కల సాకారం చేయడానికి పూర్తి స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు. గత ప్రభుత్వ లేఅవుట్లలో మధ్యలోనే నిలిచిపోయిన పేదల ఇళ్లకు ఆర్థిక సాయం అందించి పూర్తి చేయడం, సొంత స్థలాలు ఉన్న వారికి ఇళ్లు నిర్మిం చుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.అందులో భాగంగా ఈనెల 12న సామూహిక ఇళ్ల ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టారు. కోనసీమ జిల్లా లో 6,300 ఇళ్లు, కాకినాడ జిల్లాలో 6వేల వరకు ప్రారంభించనున్నారు. కోనసీమ జిల్లా ద్రాక్షారామలోని వెలంపాలెం లేఅవుట్, కాకినాడలోని కరప మండలం వేలంగిలో సామూహిక ఇళ్లను ప్రారంభించనున్నారు. సొంత స్థలాలు ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేలా ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తుదారుల వివరాలను కేంద్రప్రభుత్వ హౌసింగ్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి అనుమతులు ఇవ్వనున్నారు.

నాడు జగన్ ఆరంభించినా..

నవరత్నాలు- పేదలందరికి ఇళ్లు పేరుతో అప్పటి జగన్ ప్రభు త్వం 2020 డిసెంబర్ 25న పథకం ప్రారం భించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లిలోని కొమరగిరిలో అప్పటి సీఎం జగన్ ఈ పథకాన్ని ప్రారంభించారు. కాకినాడ నగరానికి చెందిన 16 వేల మంది లబ్ధిదారులకు పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలంలోని కొమరగిరిలో 250 ఎకరాలు కొనుగోలు చేశారు. ఇక్కడ సైతం ఇళ్ల నిర్మాణం పాతిక శాతం కూడా పూర్తికాలేదు.పైగా ఇక్కడ అప్పటి సీఎం జగన్ పథకాన్ని ప్రారంభించగా, పూర్తిగా విఫలమైంది. ఇలా ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లాలో అనేక లేఅవుట్లు ఇళ్ల నిర్మాణం జరగక దిష్టిబొమ్మల్లా మారాయి.

ఖాళీ స్థలాలపై సీఎం దృష్టి..

ప్రభుత్వం మారడంతో వీటిపై సీఎం చంద్రబాబు దృష్టిసారించారు. వేల కోట్లు వెచ్చించిన లేఅవుట్ల పరిస్థితిపై కలెక్టర్ల ద్వారా నివేదిక సిద్ధం చేయిస్తున్నారు.ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని లే అవుట్లలో 1.70 లక్షల స్థలాలు ఖాళీగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో 1.06 లక్షల స్థలాలు పూర్తిగా ఖాళీగా ఉన్నాయని తేల్చారు. ఇందులో కొమరగిరి, కరప, రౌతులపూడి, తుని, కోటనందూరు, ఏలేశ్వరం, తాళ్లరేవు తదితర మండలాల్లో లేఅవుట్లు ఉన్నట్టు గుర్తించారు. కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో 64 వేల వరకు స్థలాలు ఖాళీగా ఉన్నట్టు గుర్తించారు. ఇందులో అసలే మాత్రం పనికిరానివి ఎన్ని? శ్మశానాల పక్కన ఉన్నవి ఎన్ని అనేది తేల్చబోతున్నారు. దీని ఆధారంగా పట్టాలు రద్దు చేస్తారు.

'తూర్పు'న లెక్క ఇలా..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలో 10,794 పేదల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా యంత్రాంగం పని చేస్తోంది. ఈ మేరకు కలెక్టర్ పి.ప్రశాంతి టార్గెట్ నిర్ణయించి ఆయా లేఅవుట్ల వారీ ప్రత్యేకాధికారులను నియమించి పనులు పరుగులు పెట్టిస్తున్నారు.ఇప్పటి వరకూ 5957 ఇళ్లు పూర్తయ్యాయి. ఇంకా 4837 ఇళ్ల నిర్మాణం పెండింగ్‌లో ఉంది.ఈ నెల 7వ తేదీకి మరో 2419 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటికి అందులో 62 పూర్తి చేశారు. ఇంకా జిల్లాలో 310 ఆర్‌సీ లెవల్, 1144 రూఫ్ లెవల్‌లో ఉన్నాయి.వాటిని ముందుగా పూర్తి చేసే ఆలోచన ఉంది. బేస్‌మెంట్ లెవల్‌లో 5714, లింటల్ లెవల్‌లో 2193 ఉన్నాయి. అవిప్పుడే పూర్తయ్యే అవకాశం లేదు. ఇళ్ల నిర్మాణ లక్ష్యాలతో ముందుకు వెళ్లే అధికారులకు కొన్ని ఇబ్బందులతో ఒత్తిడికి గురవుతున్నారు.

» 12న సామూహిక ఇళ్ల నిర్మాణాలు?
» ప్రారంభానికి అధికారుల సన్నాహాలు
» కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
» గత ప్రభుత్వ నిర్వాకంపై నివేదిక
» 1.70 లక్షల ఇళ్ల స్థలాలు ఖాళీ
» ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క
» రద్దు చేసే యోచనలో సర్కారు



కాకినాడలో ఖాళీగా వెక్కిరిస్తున్న లేఅవుట్

నేటి నుంచి డీఎస్సీ

» 30 వరకూ పరీక్షల నిర్వహణ
» ఆరు పరీక్షా కేంద్రాల ఏర్పాటు
» జిల్లావ్యాప్తంగా హాజరుకానున్న 41,017 మంది అభ్యర్థులు
» ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకూ నిర్వహణ

కాకినాడ రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఏపీ మెగా డీఎస్సీ-2025 పరీక్షలను శుక్రవారం ప్రారంభం కానున్నాయని, ఈనెల 30 వరకూ ఆన్‌లైన్‌లో కొనసాగతాయని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. ఆరు పరీక్షా కేంద్రాల్లో ఈనెల 6వతేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలకు జిల్లాలో మొత్తం 41,017మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 12 వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకూ, రెండు సెషన్లలో జరుగుతాయని తెలిపారు. ఇంగ్లీషు ప్రొఫీషియన్సీ పరీక్షలు మాత్రం మూడు సెషన్లలో జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏడుగురు విద్యాశాఖ అధికారులను, విభాగాల అధికారులుగా నియమించామని, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని తెలిపారు. ఆయా కేంద్రాల్లో దివ్యాంగులకు సంబంధించి 87మంది స్క్రైబ్‌లను నియమించినట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు లేటెస్ట్ ఫొటో, గుర్తింపుకార్డుతో తప్పనిసరిగా హాజరుకావాలని పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్షా కేంద్రాల సమాచారంకోసం అభ్యర్థులు 9492515116, 7799698462, 7989750963 నెంబర్లలో సంప్రదించాలని డీఈవో సూచించారు. పరీక్షలు ముగిసిన రెండు రోజుల తర్వాత ప్రాథమిక కీని విడుదల చేస్తారన్నారు.

● ఆరు కేంద్రాల్లో నిర్వహణ

కాకినాడ పరిధిలో కాకినాడ అచ్చుతాపురం రైల్వేగేటు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్‌లో మొదటిరోజు రెండు సెషన్లలో 500 మంది, కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెంలోని సాఫ్ట్ టెక్నాలజీస్‌లో 260 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పెద్దాపురం పరిధిలోని సూరంపాలెంలో ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో 220మంది, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 280మంది, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 210మంది, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 130 మంది అభ్యర్థులకు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. మొత్తం జిల్లాలో ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

» అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టరేట్(కాకినాడ), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభం అవుతున్న మెగా డీఎస్సీ 2025 పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం డీఎస్సీ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తుమన్నారు. పరీక్షలకు 41,017మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, ఈనెల 30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

ముందస్తు ఖరీఫ్ సరే..

విత్తనాలు ఉన్నట్టేనా?

» బదిలీల ప్రహసనంలో వ్యవసాయశాఖ అధికారులు

సామర్లకోట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రైతుకు సాగుకు అవసరమైన సేవలన్నీ రైతు ముంగిటకే సేవలు అని ప్రభుత్వం ప్రకటిస్తోంది. కానీ రైతులకు అవసరమైన కాలంలో కావాల్సిన ఎరువుల సరఫరాలో అదునుకు అందుబాటులో లేక చేతులెత్తేస్తోంది. కాలువల్లో సాగునీరు జూన్ 1 నాటికే విడుదల చేస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన కార్యరూపం దాల్చింది. వ్యవసాయశాఖ ద్వారా ఈ ఖరీఫ్ సీజన్‌కు విత్తనాల అందుబాటులో ఉండే అవకాశాలు ఎంత మాత్రం కానరావడంలేదు. ఎందుకంటే ప్రభుత్వం ఆ దిశలో ప్రకటించిన దాఖలాలు లేకపోయాయి. ఖరీఫ్ సాగుకు విత్తనాలు ఎప్పుడు వస్తాయో తెలియక రైతులకు ఏమి సమాధానం చెప్పాలో తెలియక ఆయా మండలాల వ్యవసాయాధికారులు ముఖం చాటేస్తున్నారు. బదిలీల ప్రక్రియలో నిమగ్నమయ్యారు. రైతులు సహచర రైతులపైనా, నాణ్యమైన విత్తనాలకోసం డీలర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అదనుగా కొందరు ప్రైవేట్ డీలర్లు విత్తనాలు, ఎరువుల ధరలను భారీగా పెంచి అమ్ముతున్నారు. అయినా అరికట్టేవారేలేరు. ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని వ్యవసాయాధికారులు డీలర్లకు చేస్తున్న హెచ్చరికలు బేఖాతరు చేస్తున్నారు. ముందస్తు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుదామని వ్యవసాయశాఖ యంత్రాంగం ప్రకటనలు గుప్పించింది. అందుకు తగిన రీతిలో ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడంలో ముందుకు రాలేదు. అందరూ బదిలీల వ్యవహారంలో నిమగ్నం కావడంతో సహజంగానే ఖరీఫ్ సీజన్‌పై అధికారులు దృష్టి సారించలేకపోయారన్న ఆరోపణలున్నాయి.

కాకినాడ జిల్లాలో 20 మండలాల పరిధిలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎంవోపీ ఎరువులు జూన్ 1 నుంచి ప్రారంభించే ఖరీఫ్ వరి సాగుకు 44,500 మెట్రిక్ టన్నుల మేర సిద్ధం చేయాల్సిఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. వ్యవసాయశాఖ పరిధిలో రైతు సేవా కేంద్రాలద్వారా 20శాతం ఎరువులు మాత్రమే పంపిణీ



చేసేందుకు మొగ్గుచూపుతోంది. మిగిలిన 80 శాతం రైతులు ప్రైవేట్ డీలర్లపై ఆధారపడాల్సి వస్తోంది. బఫర్ స్టాక్ సిద్ధం చేశామని చెప్తున్నా రైతులకు పడిగాపులు తప్పడంలేదు.

పలు సమస్యలు..

రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని సేవలందిస్తున్నామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పగా చెప్పినా వాటి వల్ల రైతులకు ఇబ్బందులు, సమస్యలు తప్ప అక్కరకు రాలేకపోయాయి. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పొందాలంటే ఆధార్ బేస్డ్ ఈ-పాస్ తప్పనిసరిగా వేయాలి. రైతుకున్న భూములకు వెబ్‌ల్యాండ్‌లో ఉన్న వాటికి తప్పులు ఉండడంతో సరిపడా ఎరువులు లభించడం లేదు. పాత బ్యాలెన్స్‌లో ఉన్న వివరాలు, ఈ-పాస్‌లో రైతుల వివరాలకు తేడాలు ఉండడంతో ఎరువుల సరఫరాలో గత ప్రభుత్వంలో జరిగిన లోపాలను సరిదిద్ది మెరుగైన సేవలందించాల్సిఉంది. అప్పటి రైతు భరోసా కేంద్రాలు నేటి రైతు సేవా కేంద్రాలను ప్రక్షాళన చేయాల్సిఉంది. సాంకేతికంగాను మరిన్ని మార్పులు చేపట్టాల్సిఉంది. దీనికి తోడు లక్షల సంఖ్యలో ఉన్న కౌలు రైతులను వందల సంఖ్యలో చూపుతున్నారు. దాళ్వా సీజన్ ముగిసినా సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ ఒక కొలిక్కి రాకపోవడంతో కౌలు రైతులు వాటికోసం ఎదురు తెన్నులు చూస్తున్నారు. దీంతో కౌలు రైతులకు సైతం ఎరువులు అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో వాస్తవ సాగు ఇదే..

ఈఏడాది ఖరీఫ్ సాగుకు జిల్లాలో 20 మండలాలకు సంబంధించి 2,30,750 ఎకరాల్లో వరి పండించే భూములున్నాయి. మరో 2లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి, పామాయిల్, కర్రపెండలం తదితర పంటలు సాగు చేస్తున్నారు. వ్యవసాయశాఖ ద్వారా రైతు సేవా కేంద్రాలకు 44వేల500 మెట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేయాల్సిఉంది. వీటిని రైతులకు జూన్ 1 నుంచి సెప్టెంబరు వరకూ రైతులకు సరఫరా చేయాలి. ఆర్‌ఎస్‌కేల్లో గోదాముల కొరత కారణంగా ఎరువులు అధికంగా దాచుకునే సౌలభ్యం లేదు. ఆగస్టు, సెప్టెంబరు నెల ల్లో 15వేల మెట్రిక్‌టన్నుల మేర యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంవోపీ తదితర ఎరువులు అవసరం కాగా ఆ సమయంలో సరఫరా చేయ లేక వ్యవసాయశాఖ అధికారులు విఫలమవుతున్నారు.

50 మెట్రిక్ టన్నులు కావాలి

జిల్లాకు 50మెట్రిక్‌టన్నుల విత్తనాలు అవసరం ఉంది. ఏపీ సీడ్స్ ద్వారా విత్తనాలు ప్రభుత్వపరంగా రాయితీలతో వచ్చే అవకాశాలు తక్కువగాఉన్నాయి. డెల్టాప్రాంతాల్లో 1318 స్వర్ణ, 5204ఆర్పీబయో,అప్‌ల్యాండ్ ప్రాంతాల్లో సంపద స్వర్ణ, అంకుర్‌సోనా, సాధన తదితర ప్రైవేట్ రకాల విత్తనాలు వినియోగిస్తున్నారు. అక్టోబరు 31నాటికి మొదటి పంట పూర్తిచేసేలా, నవంబరు 2 నుంచి మార్చి 15నాటికి రెండో పంట పూర్తిచేసేలా, మార్చి 15నుంచి మూడో పంటగా అపరాలు సాగుచేసేలా రైతులను చైతన్యం చేస్తాం. గొట్టపుబావులు, చెరువుల కిం ద మెట్టప్రాంతపు ఆయకట్టు పొలాల్లో వరికి బదులుగా మొక్కజొన్న, అపరాలు సాగు చేయాలని సూచిస్తున్నాం.

-విజయకుమార్, జిల్లా వ్యవసాయాధికారి

కార్మికశాఖ సహాయ కమిషనరుగా శ్రీనివాస్ మహేష్

కాకినాడ సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ సహాయ కమిషనరుగా పి.శ్రీనివాస్‌మహేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయవాడనుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్.బుల్లిరాణి అదే హోదాలో కొవ్వూరు బదిలీ అయ్యారు. ఈ మేరకు కార్మిక శాఖ కమిషనరు ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టర్‌ను కలిసిన కర్మాగారాల ఇన్‌స్పెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూన్5(ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా నరసరావుపేటనుంచి జిల్లాకర్మాగారాల ఇన్‌స్పెక్టర్‌గా కొపనాతి రాంబాబు నియమితులయ్యారు. గురువారం ఆయన కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న రాంబాబు

డీఐజీ సంతకం ఫోర్జరీ

» రైల్వే హెడ్ కానిస్టేబుల్ నిర్వాకం
» ఎస్‌ఐగా నకిలీ ఐడీ కార్డ్ తయారీ
» మునుపటి స్థానానికి బదిలీ

మెయిన్ 3వపేజీలో..

ఎస్పీ ఆధ్వర్యంలో యోగాభ్యాసం

కాకినాడ క్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర వేడుకల్లో భాగంగా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో 400మంది పోలీసు అధికారులు, సిబ్బందితో గురువారం సామూహిక యోగాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని... మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. నిరంతరం బందోబస్తు, ట్రాఫిక్ డ్యూటీ నిర్వహణలో ఎక్కువ సమయం నిలుచుని ఉండడంతో పోలీసులకు నడుము సంబంధిత, ఊపిరితిత్తుల సమస్యలతో పాటు మానసిక ఒత్తిడికి గురవుతారన్నారు. వీటన్నిటినీ ఎదుర్కొనేందుకు యోగా ముఖ్యమైన సాధనమని, దీన్ని నిత్యం కొనసాగించాలని కోరారు. అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్, ఎస్‌బీ డీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న ఎస్పీ, పోలీస్ సిబ్బంది

అనాథలను చేసి.. వెళ్లిపోయారు!


కామేశమహర్షి

- అమలాపురం శ్రీకామాక్షీ పీఠం పీఠాధిపతి కామేశమహర్షి హఠాన్మరణం
- 300మందికిపైగా అనాథలకు ఆశ్రయం కల్పించిన మహోన్నత వ్యక్తి
- అక్కున చేర్చుకుని ఆదరించడమే కాక వివాహాలు సైతం చేసిన మహర్షి
- ప్రేమతత్వం.. ఆధ్యాత్మికత.. సేవా గుణం కలగలిసిన మనీషి..
- నేడు కామాక్షీ పీఠంలో మహర్షి సిద్ధిసమాధి

అమలాపురం టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఒకరా ఇద్దరా.. వందలాదిమంది అనాథలను అక్కున చేర్చుకుని ఆదరించిన మంచి మనసున్న వ్యక్తి ఆయన.. అనాథలకు ఆశ్రయం కల్పించడంతోపాటు వివాహాది కార్యక్రమాలు సైతం నిర్వహించిన నిండైన హృదయం కలిగిన గొప్ప వ్యక్తి ఆయన.. ఎందరినో సొంతింటి వాళ్లను చేసిన ఘనత ఆయనది.. ఆయనే అమలాపురం శ్రీకామాక్షీ పీఠం పీఠాధిపతి కామేశమహర్షి. ఆయన అనారోగ్య కారణాలతో గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా అమలాపురంలో పరమపదించారు. ఈ సందర్భంగా ఆయనపై ప్రత్యేక కథనం..

కామాక్షీదేవి అనుగ్రహంతో..

కామాక్షీదేవి అనుగ్రహంతో కంచి పరమాచార్య శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి ఆశీర్వాదంతో కామేశమహర్షి అమలాపురంలో శ్రీకామాక్షీ పీఠాన్ని స్థాపించారు. పీఠాధిపతిగా అమ్మవారి సేవకు మాత్రమే పరిమితం కాకుండా మానవసేవే మాధవసేవగా ఎంచుకున్న ఆయన ప్రేమతత్వాన్ని ప్రబోధిస్తూ ముందుకు సాగారు. ఆయన సేవలకు గుర్తింపుగా మద్రాసు తెలుగు అకాడమీ ఉగాది పురస్కారంతోపాటు రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ఎన్నో సంస్థలు, క్లబ్‌లు అవార్డులు, రివార్డులతో ఆయన్ను సత్కరించి సేవలను కొనియాడారు. అటువంటి ఆదర్శ మహనీయుడు కామేశమహర్షి(88) గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు బ్రహ్మీభూతత్వసిద్ధిని పొందారు. అహర్నిశలు తమకోసం శ్రమించిన కామేశ మహర్షి కన్నుమూయడంతో ప్రేమమందిరం చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.ఆదర్శనీయుడైన ఆమహనీయుని జీవితంలోని పలు ఘట్టాలు ఇలా ఉన్నాయి.

ఒక్కగానొక్క కొడుకు..

అమలాపురం పట్టణానికి చెందిన బెహరా సుబ్రహ్మణ్యం-వెంకటరత్నమాంబ దంపతులకు 1938, ఏప్రిల్ 2న యర్రంరాజు జన్మించారు. ఒక్కగానొక్క కుమారుడు కావడంతో ఎంతో అల్లారు ముద్దుగా యర్రంరాజును పెంచారు. సుబ్రహ్మణ్యం ఉద్యోగ రీత్యా పలు ప్రాంతాల్లో పనిచేయడంవల్ల చిన్నతనంలోనే పలు ప్రాంతాల్లో తిరిగారు. అనంతరం అమలాపురంలో డాక్టర్ జొన్నలగడ్డ మల్లపరాజువద్ద ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యనభ్యసించిన యర్రంరాజు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాలలో బీఎస్సీ చదివారు. మద్రాసు కాలేజ్ ఆఫ్ఇంజనీరింగ్ టెక్నాలజీలో ఏఎంఐఈ ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేశారు. అలా ఉన్నత చదువులు పూర్తి చేశారు.

కంచి పరమాచార్య స్ఫూర్తితో..

ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసిన యర్రంరాజు కంచి పరమాచార్యశ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామిని స్ఫూర్తిగా తీసుకున్నారు. కామేశమహర్షిగా మారి చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి ఆశీర్వాదంతో కామాక్షీదేవి అనుగ్రహంతో 1967లో అమలాపురం కూచిమంచి అగ్రహారం రోడ్డులో కామాక్షీ పీఠాన్ని ఏర్పాటు చేశారు. శ్రీకామాక్షీదేవి అనుగ్రహంతో ఎన్నో ధర్మప్రచార ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలను నిర్వహించారు. కామాక్షీ పీఠానికి తల్లిదండ్రులు తమ ఆస్తిని అందిస్తే దాతలు ముందుకు రావడంతో ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దారు. రోళ్లపాలెంలో అమలేశ్వరస్వామిఆలయాన్ని నిర్మించారు. అక్కడకు సమీపంలోని చిందాడమడుగును వెలుగులోకి తీసుకువచ్చి గోదావరి పుష్కరాలకు అంతర్వాహినిగా తీర్చిదిద్దారు. తుని మండలం హంసవరంలో శ్రీకామాక్షీదేవి, ఆదిశంకరుల ఆలయాలను కామేశమహర్షి నిర్మించారు.

కంచితో అనుబంధం..

కామేశమహర్షికి కంచి పీఠంతో ఎనలేని అనుబంధం ఉంది. 1967లో చంద్రశేఖరేంద్రసరస్వతీస్వామిజీ అమలాపురం వచ్చినప్పుడు ఆయన్ను ప్రత్యేకంగా కలిశారు. 1972, 1996 తుఫాను సమయంలోను అమలాపురం శ్రీకామాక్షీ పీఠాన్ని జయేంద్రసరస్వతీమహాస్వామి సందర్శించారు. పేరూరులో విజయయాత్రకు వచ్చిన శ్రీవిజయేంద్రసరస్వతి స్వామిజీపీఠాన్ని సందర్శించారు. ఎన్నోసార్లు కంచి కామాక్షీ పీఠాన్ని కామేశమహర్షి సందర్శించారు.

చిన్నారులకు అన్నీ ఆయనే..

ప్రేమ మందిరంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు తల్లీతండ్రి ఆయనే. గురువు, బంధువు, స్నేహితులు ఆయనే. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న చిన్నారుల ఇంటిపేరే ప్రేమమందిరం. అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాల్లోని ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు ముందుకు రావడంతో ఉచితంగానే ఇంజనీరింగ్, డిగ్రీ, ఇంటర్మీడియట్ కోర్సులు పూర్తి చేస్తున్నారు. మరికొందరు స్వల్ప ఫీజులతో చదువుకుంటుంటే మరికొందరు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు దశాబ్దాల వ్యవధిలో ప్రేమమందిరంలో ఆశ్రయం పొందిన 60మంది యువతులు, 20మంది యువకులకు అన్నీ తానై వివాహాలు జరిపించిన ఘనత కామేశమహర్షిదే. వారిలో ఎందరో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతూ జీవితంలో స్థిరపడ్డవారే. ప్రకృతి విపత్తుల సమయాల్లో శ్రీకామాక్షీ పీఠం తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. అన్నదానం, వస్త్రదానం కూడా చేశారు.

2019లో సహస్ర పూర్ణచంద్ర దర్శనం

కామేశ మహర్షికి 2019, మే 5న సహస్ర పూర్ణ చంద్రదర్శన మహోత్సవాలు వారంరోజులపాటు నిర్వహించారు. శ్రీకామాక్షీదేవి అనుగ్రహంతో కామేశమహర్షి రచించిన అనేక పుస్తకాలను విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి బులుసు శివశంకరరావు ఆవిష్కరించారు.

కామాక్షీ ప్రేమమందిరం ఏర్పాటు ఇలా..

1986లో గోదావరి వరదల కారణంగా అమలాపురం మార్కెట్ ఏరియాలో ముంచెత్తిన వరదలతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అనాథలుగా మారారు. దీంతో చలించిన కామేశ మహర్షి కృష్ణ, సత్యవతి, నాగమహేశ్వరి అనే బిడ్డలను తీసుకుని కామాక్షీ పీఠానికి చేరుకున్నారు. అప్పుడు గోదావరి వరదల పర్యవేక్షణకు ప్రత్యేకంగా నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారి టి.గోపాలరావుతో కామాక్షీ ప్రేమమందిరాన్ని ప్రారంభింపజేశారు. ముగ్గురితో ప్రారంభమైన ప్రేమమందిరం ఇప్పటివరకు 300మందికిపైగా బిడ్డలకు ఆశ్రయం కల్పించింది. తల్లి పొత్తిళ్లలో కళ్లు తెరవని ఆడబిడ్డలు సైతం కామాక్షీ ప్రేమ మందిరంలోనే కళ్లు తెరిచారు. అమ్మానాన్నలను కోల్పోయి అయినవాళ్లకు దూరంగా.. అనాథలుగా మారినవారు కొందరైతే, ప్రకృతి వైపరీత్యాలు, కుటుంబ తగాదాలతో ఒంటరిగా మిగిలిన అనాథలకు ఆయన ఆశ్రయం కల్పించారు. ప్రస్తుతం ప్రేమ మందిరంలో 55మంది పిల్లలతోపాటు ఐదుగురు పెద్దలు ఉంటున్నారు.


కామేశమహర్షి సహస్రపూర్ణచంద్రోదయ దర్శన మహోత్సవంలో పాదపూజ(ఫైల్)

నేడు కామాక్షీపీఠంలో దివ్యసమాధి

కామేశమహర్షి బ్రహ్మీభూతత్వ సిద్ధిని పొందడంతో భక్తుల దర్శనార్థం కామాక్షీ పీఠంలో ఉంచారు. శుక్రవారం ఉదయం 6.30గంటలకు కామేశమహర్షి దివ్యసమాధి కార్యక్రమం నిర్వహించేందుకు పీఠం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. 8న ఆదివారం బ్రహ్మీభూత దివ్య ఆరాధన మహోత్సవంతోపాటు అష్టోత్తర శతవార విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించేందుకు శిష్య బృందం ఏర్పాట్లు చేసింది.

కొంగలే.. ఎగిరెనే..!


ఓ పక్క వేసవితో జనం అల్లాడిపోతున్నారు. అలాంటిది పక్షుల పరిస్థితి ఏంటి..? కాకినాడ వలసపాకల బీచ్ రోడ్డుపక్కన ఆకలి, దాహం తీర్చుకునేందుకు వచ్చిన కొంగలు కాసేపు ఇసుక తిన్నెలపై ఎండిచేపలు తిన్నాయి.. కాసేపటికి అన్నీ కలిసి గుంపుగా.. ఒకేసారి ఎగురుతూ.. ఇలా కనిపించాయి.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

మొక్కలు నాటి.. పెళ్లి పీటలు ఎక్కారు

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ఆదర్శంగా నిలిచిన నూతన జంట


అల్లూరిజిల్లా కూన వరం మండలం పైడిగూడెంలో పెళ్లి వస్త్రాలతోనే మొక్కలు నాటుతున్న నవీన్, రమ్య

కూనవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో తామూ భాగస్వాములవుతామంది ఓ నూతన జంట. అల్లూరిజిల్లా కూనవరం మండలం పైడిగూడెం గ్రామానికి చెందిన నవీన్, రమ్య వివాహానికి పెద్దలు గురువారం ముహూర్తం నిర్ణయించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం కావడంతో ముందుగా వారు అటవీ అధికారుల సమక్షంలో పెళ్లి వస్త్రాలతోనే మొక్కలు నాటి ఆ తర్వాత వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచారు. డీఎఫ్‌వో బబిత, సబ్ డీఎఫ్‌వో రాఘవరావు, కూనవరం అటవీ శాఖ అధికారి కరుణాకర్ పాల్గొన్నారు.

బాలబాలాజీస్వామి పెండ్లికొడుకాయెనే

- ఘనంగా ప్రారంభమైన అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు

మామిడికుదురు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వైనతేయ నదీతీరంలోని అప్పనపల్లి బాలబాలాజీస్వామివారు కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం పెండ్లి కొడుకయ్యారు. జ్యేష్ఠ శుద్ధ దశమి పర్వదినాన వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, గోవిందనామస్మరణలు, సుంగధ ద్రవ్యాల పరిమళాల మధ్య శ్రీబాలబాలాజీస్వామివారి తిరు కల్యాణ మహోత్సవాలకు గురువారం అంకురార్పణ జరిగింది. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని బాలబాలాజీస్వామితోపాటు శ్రీదేవిభూదేవిలను వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి వారి బుగ్గన చుక్కపెట్టి నుదుటిన కల్యాణం దిద్ది పెండ్లి కొడుకు, పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేశారు. కల్యాణోత్సవాలకు ఏవిధమైన ఆటంకాలు తలెత్తకుండా విశ్వక్సేనారాధన కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు, భక్తులు 108 కలశలతో పంచామృతాలు, సుంగధ ద్రవ్యాలు, పసుపు కుంకుమలతో స్నపన తిరుమంజన సేవను కన్నుల పండువ గా నిర్వహించారు. పుట్ట నుంచి సేకరించిన పుట్ట మన్నును తొమ్మిది పాత్రల్లో నింపి అంకురార్పణ కార్యక్రమాన్ని జరిపించి పుణ్యావహచనం, పంచగవ్యప్రాశనం, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణోత్సవాలు పంచారాత్ర ఆగమానుసారం ఆలయ ఉపముఖ్య అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, త్రిదండ శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి, వారి శిష్యులు, చలమచర్ల వేణుగోపాలాచార్యుల బృందం ఆధ్వర్యంలో ఐదురోజులపాటు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు ఘనంగా చేశారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. స్వామి వారి కల్యాణం శుక్రవారం రాత్రి 9.15 గంటలకు జరుగుతుందని, భక్తులు పాల్గొని కల్యాణాన్ని కనులారా వీక్షించి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సహాయ కమిషనర్ సత్యనారాయణరాజు కోరారు.


బాలబాలాజీస్వామిని పెండ్లికుమారుడిని చేస్తున్న అర్చకులు


కలశల్లో ఏర్పాటు చేసిన అంకురాలు.. చిత్రంలో కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు

సత్యదేవుడి సన్నిధిలో సేవ చేయాలనుకుంటున్నారా?

- దేవస్థానం పీఆర్వో విభాగంలో భక్తులు నమోదు చేసుకునే అవకాశం

అన్నవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో భక్తులకు మంచినీటి సరఫరా, అన్నప్రసాదం వడ్డన, క్యూలైన్‌ల్లో భక్తులను ముందుకు కదపడానికి తదితర సేవలు చేయడానికి ఆసక్తి కలిగినవారు దేవస్థానం పీఆర్వో విభాగంలో వారి పేర్లు, ఇతర వివరాలు నమోదు చేసుకోవాలని అన్నవరం దేవస్థాయం ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల సేవకు విచ్చేసిన తెలంగాణ భక్తులు మధ్యవర్తుల ద్వారా రావడం.. అనంతరం వారిని దేవస్థానంలో ఒక అధికారి దురుసుగా మాట్లాడడంతో వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు సేవ చేయాలనుకునే భక్తులు తునికి చెందిన శ్రీవారిసేవ అనే సంస్థ ద్వారా విచ్చేసేవారు. ఇకపై ఆసక్తి ఉన్నవారు నేరుగా పీఆర్వో కార్యాలయం ద్వారా సేవ చేసుకునే వీలు కల్పించారు.

ఎన్‌బీఏతో సాంకేతిక విద్యలో నాణ్యతా ప్రమాణాలకు ప్రోత్సాహం

- జేఎన్టీయూకే ఉపకులపతి ప్రసాద్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే,జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎన్‌బీఏ గుర్తింపు ద్వారా సాంకేతిక విద్యలో నాణ్యతా ప్రమాణాలను ప్రోత్సహించేందుకు మరింత వీలు కలుగుతుందని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. వర్సిటీలో నియూసీఈకే కళాశాలకు యూజీ ప్రోగ్రామ్స్‌కు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించిన సందర్భంగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు అధ్యక్షతన అలూమ్ని ఆడిటోరియంలో గురువారం ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులకు, బోధన, బోధనేతర సిబ్బందికి అభినందనసభను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ ప్రసాద్ మాట్లాడుతూ సివిల్, ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలను ఎన్‌బీఏ బృందం గతనెలలో సందర్శించిందన్నారు. ఈ ఐదువిభాగాలకు 2025-26, 2026-27, 2027-28 విద్యాసంవత్సరాలకుగాను ఎన్‌బీఏగుర్తింపు లభించిందని,2028, జూన్ 30వరకూ ఈ విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు కొనసాగుతుందని తెలిపారు. వైస్‌ప్రిన్సిపాల్స్ జీవీఎస్ఆర్ దీక్షితులు, స్వరూపారాణి విభాగాధిపతులు కోటేశ్వరరావు, వెంకటరెడ్డి, మధు, సురేఖ, కళ్యాణమనోహర్, సత్యవేణి, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, మాజీ వీసీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ముంగండ విద్యార్థుల ఎంపిక

పి.గన్నవరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ముంగండ గ్రామానికి చెందిన పదిమంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 4న ఉమ్మడి జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం మండలంలోని ముంగండ గ్రామానికి చెందిన వి.రిషిత, ఎంపీఎస్ లక్ష్మి, పి.వర్షిణి, వి.ప్రణిత్, ఎం.జగదీష్, వీఎంవీ గోపాల్, ఎం.సుజయ్, దీప్, బ్లూ వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు కోచ్ పి.భార్గవి తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈనెల 9 నుంచి 11వతేదీ వరకూ రాష్ట్రస్థాయిలో అనంతపురంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆమె చెప్పారు.


ముంగండ హైస్కూల్‌లో తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ పి.భార్గవి

చాగంటికి కలిసిన ఎంపీ సతీష్‌బాబు


కాకినాడ సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల మోకాలి శస్త్రచికిత్స చేయించుకుని పూర్తిగా కోలుకున్న రాష్ట్రప్రభుత్వ సలహాదారు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతేడాది విద్యార్థుల నీతి, విలువల ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా చాగంటి నియమితులయ్యారు.


చాగంటికి పట్టువస్త్రాలు అందజేస్తున్న ఎంపీ సతీష్‌బాబు

ఉపాధ్యాయుడిగా మారిన అనపర్తి ఎమ్మెల్యే

- పర్యావరణంపై విద్యార్థులకు బోధించిన రామకృష్ణారెడ్డి

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 5(ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఉపాధ్యాయుడిగా మారారు. బ్లాక్‌బోర్డుపై పాఠాలు చెప్తూ టీచర్ అవతారం ఎత్తారు. గురువారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షించడంలో విద్యార్థులు ముందంజలో ఉండాలని వారికి బోధించారు. మండల కేంద్రమైన పెదపూడిలోని శ్రీ విజ్ఞాన్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు కొద్దిసేపు పాఠాలు బోధించారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పర్యావరణం.. దాని ఆవశ్యకతపై కాసేపు పాఠం బోధించారు. తరగతి గదిలోకి వెళ్లగానే ఆయన టీచర్‌గా మారిపోయారు. విద్యార్థులతో ఎమ్మెల్యేగా కాకుండా ఒక పాఠశాల ఉపాధ్యాయుడిగా ప్లాస్టిక్ నివారణ మొక్కల పెంపకం పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను 20 నిమిషాలపాటు చక్కగా వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ముందుండాలని పిలుపునిచ్చారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పాఠశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెదపూడి గ్రామ సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, విద్యావేత్త, సామాజికకార్యకర్త వీఎస్ఎన్ మాస్టారు, టీడీపీ నాయకులు పుట్ట గంగాధర్‌చౌదరి, అమ్మన్న చౌదరి, డీసీ చైర్మన్ సాన శ్రీనివాసరావు, దత్తుడు, జనసేన నాయకులు నాగు పాల్గొన్నారు.


పాఠాలు బోధిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కాకినాడ జిల్లాలో రేపటినుంచి ట్రాఫిక్ మళ్లింపు

- సామర్లకోట-అచ్చంపేట రోడ్డులో బ్రిడ్జి పనుల కారణంగా మార్పు

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో సామర్లకోట నుంచి అచ్చంపేట వెళ్లే రహదారిలో శుక్రవారం నుంచి ట్రాఫిక్ మళ్లించనున్నారు. ఇక్కడ భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా నిర్మాణంలో ఉన్న రోడ్డులో బ్రిడ్జిలకు గడ్డర్లు లేపుతున్నందున ముత్యాలమ్మ గుడి దగ్గర ఓవర్ బ్రిడ్జి గడ్డర్ లాంచ్ కోసం సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపునకు వచ్చే కెనాల్ రోడ్డు రహదారికి ట్రాఫిక్ మళ్లింపు ఈనెల 7 నుంచి 10 వరకు నిలుపుదల చేస్తున్నామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అచ్చంపేట జంక్షన్‌లో కూడా రోడ్డుపై గడ్డర్‌లు లేపుతున్నందున ఈనెల 11 నుంచి 13 వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి పోలీసు వారు సూచించిన మార్గాల్లో తమ వాహనాలను మళ్లించాలని సూచించారు.

మరిడమ్మ జాతరకు పందిరిరాట ముహూర్తం

పెద్దాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఆషాఢమాసంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పందిరిరాట ముహూర్తం నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతంగా సాగేందుకు పూజలు జరిపి అష్టదిక్పాలకులను ఆహ్వానించా మని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, వేద పండితులు, అర్చకులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


మరిడమ్మ ఆలయ ఆవరణలో పందిరిరాట వేస్తున్న దృశ్యం

గుర్తు తెలియని వాహనం ఢీకొని

యువకుడి దుర్మరణం



రోడ్డుపై పడి ఉన్న గంగయ్య మృతదేహం

ఎటపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం శివారు జాతీయరహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... లక్ష్మీపురం పంచాయతీ పాలమడుగు సమీపంలోని ఎర్రకాలువవలసకి చెందిన మడివి గంగయ్య (30) ద్విచక్ర వాహనంపై చత్తీస్‌గఢ్‌లోని అత్తగారి ఊరైన సుక్మా వెళ్తున్నాడు. ఈలోగా లక్ష్మీపురం మలుపు వద్దకు రాగానే చింతూరు వైపు నుంచి భద్రాచలం వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో గంగయ్య తల పగిలి, మెదడు బయటకు వచ్చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఢీకొట్టిన వాహన చోదకుడు ఆపకుండా వెళ్లిపోయాడు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారాలతో తమిళనాడుకు చెందిన ఐషర్ వ్యాన్‌గా గుర్తించారు. వ్యాన్, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ అప్పలరాజు తెలిపారు.

చెట్టు కొమ్మ విరిగిపడి చిన్నారి మృతి

● మరో చిన్నారికి గాయాలు



చిన్నారి అక్షర (ఫైల్)

ధవళేశ్వరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు కావడంతో ఆ చుట్టుపక్కల చిన్నారులంతా చేరి చెట్టునీడన ఆటలాడుకుంటున్నారు. ఆ చెట్టే ఓ చిన్నారి పాలిట మృత్యువు అవుతుందని ఎవరూ ఊహించలేకపోయారు. గురువారం ఉదయం పది గంటల సమయంలో ధవళేశ్వరంలోని స్థానిక బస్టాండ్ వెనుక వీధిలో ఉన్న రావిశెట్టి నీడలో పాతూరి అక్షర (9), దావదాసి లిషితతో పాటు మరికొందరు పిల్లలు ఆటలాడుకుంటున్నారు. అదే సమయంలో రావిచెట్టు నుంచి భారీ కొమ్మ ఒక్కసారిగా విరిగిపడి... పక్కనే ఉన్న కరెంట్ స్తంభంపై పడి, ఆపై చిన్నారులు అక్షర, లిషితపై పడడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. దీన్ని చూసిన స్థానికులు, బంధువులు హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో అక్షర మృతి చెందగా, లిషిత ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చిన్నారి మృతితో కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్న తండ్రి త్రిమూర్తులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. దీంతో ఆ పేటలో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాదకరంగా ఉన్న ఆ చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి విరిగిపోయిన కరెంట్ స్తంభం, తెగిపోయిన వైర్లను తొలగించారు. అయితే ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ గణేష్ తెలిపారు.

తప్పిన పెద్ద ప్రమాదం

● అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ప్రమాదానికి గురైన బస్సు

మోతుగూడెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో గురువారం భద్రాచలం నుంచి పాడేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అయితే ఆ సమయానికి అక్కడ విద్యుత్ సిబ్బంది జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్నారు. అయితే ఎవరికీ ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సులో 11 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. చిన్న చిన్న గాయాలవ్వడంతో డొంకరాయి ఏపీ జెన్కో భవ్య హెల్త్ సెంటర్‌లో ప్రథమ చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న డొంకరాయి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.భాస్కర్ ప్రయాణికులు ఎక్కడికి వెళ్లాలో తెలుసుకుని సీలేరుకు చెందిన డీఏవీ స్కూల్ బస్సులో దింపాలని ఆదేశించారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

ప్రోత్సాహమేదీ..?

● ఉమ్మడి జిల్లాలో తగ్గుతున్న కూరగాయల సాగు విస్తీర్ణం .. పెరుగుతున్న ధరలు

● వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారడమే ప్రధాన కారణం

● గత వైసీపీ ప్రభుత్వంలో రాయితీలు నిలిపివేత

● కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరిస్తారని కొండంత ఆశతో రైతన్న



పొట్లపాదుల తోటలో ఓ రైతు



సామర్లకోట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో కూరగాయల సాగు విస్తీర్ణం ఊహించని రీతిలో తగ్గుతూ వస్తోంది. దీనికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువు కాగా, గ్రామాల్లో సైతం వ్యవసాయ భూములు రియల్‌ఎస్టేట్ వెంచర్లుగా మారుతుండడమే దీనికి ప్రధాన కారణం. కాగా రాష్ట్రప్రభుత్వం ఉద్యానవనశాఖ ద్వారా కూరగాయల తోటల పెంపకాలకు అందిస్తున్న రాయితీలను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిలిపివేయడంతో కూరగాయల తోటల పెంపకందారులు ఇటీవల వరకు నిరాసక్తత చూపారు. దీంతో కొత్త పంటలు కూడా వేయాలన్న ధ్యాస వారిలో కొరవడింది. అయితే ఊహించని రీతిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కూరగాయలు పండించే రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. గతంలో వలే కూటమి ప్రభుత్వం కూరగాయల పం టలకు ప్రోత్సాహాన్ని ఇస్తుందని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు మండలాలలో దాదాపు 45 వేలఎకరాల్లో కూరగాయల పంటలు సాగయ్యేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో 25వేల ఎకరాలకు పడిపోయిందని ఉద్యానవన శాఖ అధికారుల గణాంక సమాచారంగా తెలుస్తోంది. పట్టణాల్లో జనాభా గణనీయంగా పెరగడంతో స్థానికంగా సాగవు తున్న కూరగాయలు ప్రజల అవసరాలను ఏమాత్రం తీర్చలేకపోవ డంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతులు అయ్యే దానిపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ కారణంగా కూరగాయల ధరలు అనూహ్యంగా పెరుగుతు న్నాయి. అధిక మండలాల్లో కూరగాయల సాగు ఆశాజనకంగా ఉండేది. ఉమ్మడి తూర్పుజిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల నుంచి సైతం బీన్స్, వంగ, మునగ, చిక్కుడు వంటి ప్రత్యేక పంటలు ఆయా ప్రధాన మార్కెట్లు, వారపుసంతలు, రైతుబజార్లకు విరివిగా వచ్చేవి. రోజుకు 60 నుంచి 70 మెట్రిక్ టన్నుల వరకూ కూరగా యలు మార్కెట్లకు చేరేవి. కాకినాడ, రాజ మహేంద్రవరం, అమలాపురం, పెద్దాపురం, ఏలేశ్వరం, రాజానగరం, రావుల పాలెం, తుని, ప్రత్తిపాడు తదితర ప్రధాన ప్రాంతాల ప్రజలకు నిత్యం కూర గాయలు అందుబాటులో ఉండేవి. అయితే నేడు జిల్లా ప్రజల అవస రాలలో కేవలం 40 శాతం కూరగా యల మాత్రమే స్థానికంగా పండుతున్నాయి. మిగిలిన కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు చేసుకోవాల్సి వస్తోంది. బెంగళూరు నుంచి క్యారెట్, బీట్ రూట్, క్యాప్సికమ్, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వంగ, బెండ, కంద, చేమ, కాలీఫ్లవర్, క్యాబేజీ, తదితర కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నారు.

● ప్రభుత్వ ప్రోత్సాహం శూన్యం

జిల్లాలో కూరగాయలు, ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులకు గత వైసీపీ ప్రభుత్వం రాయితీలు, సలహాలు, సూచనలను అందించలేదు. విత్తనాల కోసం హెక్టార్ విస్తీర్ణానికి రూ. మూడు వేలు చొప్పున గతంలో టీడీపీ ప్రభుత్వం సబ్సిడీగా చెల్లించేది. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఇవేమీ చెల్లించలేదు. గత ఐదేళ్ల పాలనలో ఈ పంటలు పర్యవేక్షించే ఉద్యానవన శాఖ ద్వారా నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. కూరగాయల పంటలపై చీడపీడలు, పురుగులు, తెగుళ్లు ఆశించినపుడు మందుల పిచికారీ చేసే స్ప్రేయర్లపై రూ. 28 వేల వరకూ ప్రభుత్వ సబ్సిడీ ఇవ్వాల్సి ఉంది. బిందు, తుంపర సేద్య పరికరాలకు గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో కూరగాయల రైతులకు 50 నుంచి 100 శాతం వరకూ రాయితీలు అందేవి. తీగ జాతి కూరగాయల పంటలు సాగు చేసే రైతులు పందిళ్లు వేసుకునేందుకు రూ. లక్ష వరకు ప్రభుత్వ సబ్సిడీగా వచ్చేది. ఇవన్నింటినీ వైసీపీ పాలనలో పూర్తిగా నిలిపివేశారు. ఈ దశలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో కూరగాయల సాగు కాలక్రమేణా తగ్గిపోయింది. గత టీడీపీ పాలనలో అందించిన ప్రోత్సాహకాలు తిరిగి ఇప్పుడు మళ్లీ పునరుద్ధరిస్తారని వేయి కళ్లతో రైతులు ఎదురుచూస్తున్నారు.

గిట్టుబాటు ధర లేదు

- సత్తి మంగాధర్, పనసపాడు, రైతు, సామర్లకోట మండలం.

కూరగాయల సాగుకు గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పంటలకు వేసే ఎరువులు, పురుగుమందుల ధరలు బాగా పెరిగిపోయాయి. తీరా అప్పులు చేసి కూరగాయల పండించిన తర్వాత గిట్టుబాటు ధరలు లభించక దళారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఉంది. దీంతో తెచ్చిన రుణాలకు వడ్డీల భారం పెరిగిపోతుంది. అందువల్ల పంట సాగు చేయలేకపోతున్నాం.

ప్రభుత్వమే ఆదుకోవాలి

- బత్తిన శ్రీను, రైతు, సూరంపాలెం, గండేపల్లి మండలం

కూరగాయల రైతులను ప్రభుత్వమే పూర్తిగా ఆదుకోవాలి. గతంలో ప్రభుత్వాలు సబ్సిడీలపై విత్తనాలు, ఎరువులు, స్ప్రేయర్లు, బిందు, తుంపర, తదితర సాగు పరికరాలు అందించేవి. వైసీపీ హయాంలో పూర్తిగా నిలిపివేసి రైతులను తీవ్ర ఇబ్బందుల పాల్జేశారు. ఇకనైనా ఈ ప్రభుత్వం తగుచర్యలు తీసుకోవాలి.

ఒంటరితనం భరించలేక యువకుడి ఆత్మహత్య

నిడదవోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) :ఒంటరితనం భరించలేక ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన ఏజర్ల విక్రమ్(19) తల్లి కువైట్‌లో ఉండగా..తండ్రి వైజాగ్‌లో ఉంటూ చేపల చెరువు వద్ద పనిచేస్తున్నాడు. మంచిలిలో విక్రమ్ ఒక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలో ఉన్న మేనత్త ఇంటికి వచ్చాడు. చాలా సేపు అక్కడ గడిపాడు. అనంతరం మేనత్తతో ఒంటరితనం భరించలేకపోతున్న ట్టు చెప్పాడు. మేనత్త ఏదో సర్దిచెప్పింది. అయినా పట్టించుకోలేదు. కాసేపటికే వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగేశాడు. ఇది గమనించిన బంధువులు వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్‌ఐ బాలాజీ తెలిపారు.

టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభానికి సీఎం



టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ/రూరల్/కడియం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం చంద్రబాబు ఈ నెల 10 లేదా 11 తేదీల్లో ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి బొమ్మూరులోని ఆర్‌టీఐహెచ్ భవనంలోని టాటా ఇన్నోవేషన్ హబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికత, ఇన్నోవేషన్ యువతలోని నైపుణ్యం కలిగిన వారి అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమండ్రి, ఎన్టీఆర్, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ప్రభుత్వం టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మన జిల్లాలో అడ్వాన్ స్కోప్‌మోడల్‌లో ఈ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఈహబ్ నిర్వహణ విషయంలో గ్రీన్ కోఎనర్జీ, ఓఎన్‌జీసీ, గెయిల్, అవంతి సంస్థలు ప్రమోటర్లుగా ఉంటాయన్నారు. జిల్లాలో పారిశ్రామిక ప్రగతి, తద్వారా ఒక శక్తివంతమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి ఈ ఇన్నోవేషన్ హబ్ దోహద పడుతుందన్నారు. ప్రతిఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్ల పరిశీలన చేశామన్నారు. ఇదిలా ఉండగా కడియం మండలం వేమగిరి గతంలో మహానాడు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. హెలీపాడ్ ఏర్పాటుకు ఈ స్థలాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ కిషోర్, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు.

10 లేదా 11 తేదీల్లో చంద్రబాబు ఏర్పాట్ల పరిశీనలలో కలెక్టర్ ప్రశాంతి

బట్టల వ్యాపారి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ జిల్లా మండపేట రూరల్ ద్వారపూడికి చెందిన బట్టల వ్యాపారి ఎం.వీరబాబు(40) తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. ద్వారపూడికి చెందిన వీరబాబుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతడు అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. గురువారం రాజమహేంద్రవరం దోబీ ఘాట్ వద్ద గోదావరిలో మృతదేహం ఉన్నట్టు స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అతను ద్వారపూడికి చెందిన వీరబాబుగా గుర్తించారు. భార్య, బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు

వేసవి ప్రయాణికులకు సదుపాయాలు



సామర్లకోట, జూన్ 5(ఆం ధ్రజ్యోతి): వేసవి సెలవులు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రయాణికులు సొంత గ్రామాల నుంచి నగరాలకు బయలుదేరే రోజులు సమీపించినందున పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో అదనపు బోగీలను ఏర్పాటు చేసినట్టు రైల్వే సంస్థ ప్రకటించింది. సామర్లకోట రైల్వే స్టేషన్ మీదుగా అటు విజయవాడ, ఇటు విశాఖల వైపు ప్రయాణించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పెంచి అదనపు బోగీల సమాచారాన్ని గురువారం సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందించగా ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది.

● 08581, 08582 నెంబర్లు గల విశాఖపట్నం-బెంగుళూరు-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనంగా ఒక ఏసీ 3-టైర్ బోగీని జతచేసి జూన్ 29 వరకూ అందుబాటులోకి ఉంచనున్నారు.

● 08579, 08580 నెంబర్లు గల విశాఖపట్నం-చర్లపల్లి-విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనంగా ఒక ఏసీ 3-టైర్ బోగీని జతచేసి జూన్ 6నుంచి 27 వరకూ అందుబాటులో ఉంచనున్నారు.

● ఇంకా భువనేశ్వర్-న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్, పూరి-యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సైతం అదనపు బోగీలను ఏర్పాటు చేసినందున రిజర్వేషన్ తదితర సమాచారం కోసం సమీప రైల్వే స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాలు తెరిచి ఉన్న సమయంలో రైల్వే సిబ్బందిని సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయ అధికారులు తెలిపారు.

● రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌ల్లో పలు రైళ్లకు తాత్కాలిక స్టాప్‌ను మరో 6 నెలలు పొడిగిస్తూ రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయించారని రైల్వే పీఆర్వో తెలిపారు. రామేశ్వరం-భువనేశ్వర్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్, హౌరా-పుదుచ్చేరి-హౌరా ఎక్స్‌ప్రెస్‌లు పొడిగించిన తాత్కాలిక స్టాప్ రైళ్లల్లో ఉన్నట్టు తెలిపారు.

కాకినాడ అపోలోలో అరుదైన శస్త్ర చికిత్స



విలేకరుల సమావేశంలో అపోలో వైద్య బృందం

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన జంప మంగాయమ్మ వయసు 54. ఆమె గత నెల 25న ఫోను మాట్లాడుతూ చేపల కూరతో భోజనం చేస్తుండగా ఛాతి, ఉదర భాగంలో నొప్పి వచ్చింది. వెంటనే కాకినాడలోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ జి.వంశీచైతన్య పరిశీలించి సీటీ స్కాన్ చేయించారు. అందులో సుమారు నాలుగు సెంటీ మీటర్లు పొడవు ఉన్న ఒక చేప ముల్లు గుండె పెద్ద రక్తనాళం బయట గుచ్చుకుని ఉండడం గమనించారు. వాస్కులర్ ఎస్వీఆర్ కృష్ణ, డాక్టర్ వంశీ చైతన్య, డాక్టర్ ఎస్వీకృష్ణ పరిశీలించి సు మారు 10నుంచి 12గంటలు చేయవలసిన ఆపరేషన్‌ను అత్యంత మెళకువలు ఉపయోగించి కేవలం 3 గంటల్లోనే పూర్తి చేశారు. ముల్లును బయటకు తీశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా దేశంలోనే రెండోసారిగా నూతన విధానంతో ప్రణాళిక సిద్ధం చేసి ప్రముఖ గుండె మత్తు డాక్టర్ ప్రగడ నాగేశ్వరరావు, డాక్టర్ వంశీచైతన్య, డాక్టర్ ఎస్వీఆర్ కృష్ణ సమక్షంలో ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన వైద్యుల బృందాన్ని అపోలో ఆసుపత్రి సీఈవో డాక్టర్ రాచకొండ రెడ్డప్పరెడ్డి అభినందించారు.

భారత్, అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం అవసరం

ఎంపీ హరీష్ మాధుర్



అమెరికాలో లీసామెక్లేన్‌ను కలుసుకున్న భారత ప్రతినిధి బృందం

అమలాపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలను ప్రపంచ దేశాలకు తెలియజేసేందుకు వెళ్లిన ప్రతినిధి బృందం అమెరికా హైస్ రిపబ్లిక్ కాన్ఫరెన్స్ చైర్ ఉమెన్ లీసామెక్లేన్‌తో భేటీ అయ్యారు. అమెరికా హౌస్ రిపబ్లికన్ కాన్ఫరెన్సుకు కొత్తగా ఎన్నికైన చైర్ ఉమెన్, కాంగ్రెస్ ఉమెన్ లీసామెక్లేన్‌తో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి భేటీ అయ్యారు. అఖిలపక్ష విదేశీ పర్యటనలో భాగంగా ఎంపీ శశిధరూర్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ప్రారంభమైన ఈ చర్చ భారత్ అమెరికాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, చైనాకు వ్యతిరేకంగా సహకారం, డిజిటల్, రక్షణ, వాణిజ్య సహకారం వంటి అంశాలపై చర్చించినట్టు ఎంపీ హరీష్ తెలిపారు. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు పాదర్శకతతో తీసుకువచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లు, వికసిత్ భారత్ లక్ష్యంపై మెక్లేన్ ఆసక్తి చూపారని, ఆమెను భారత్ పర్యటనకు ఆహ్వానించినట్టు హరీష్ పేర్కొన్నారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానానికి దిగిన యువకుడు ప్రమాదవశాత్తూ మునిగిపోయి నీళ్లు తాగి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలో పెంటపాడు గ్రామానికి చెందిన పాలిక అభిరామ్(23) స్నేహితులను కలిసేందుకు రాజమహేంద్రవరం వచ్చాడు. స్థానిక శ్రీరాం నగర్‌లో ఉన్న స్నేహితుల వద్దకు వచ్చి అక్కడి నుంచి స్నేహితులతో కలిసి గోదావరి స్నానానికి పుష్కరాల రేవుకు గురువారం సాయంత్రం వెళ్లారు. స్నానం చేస్తుండగా అభిరామ్ ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. అతడిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించే సరికి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు అభిరామ్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు అప్పన్న ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన అప్పన్నను అభినందిస్తున్న జిమ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణానికి చెందిన బి.అప్పన్న జాతీయస్థాయి పోలీసు పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో శిక్షణ పొందుతున్న ఏపీ ప్రత్యేక రక్షణదళం కానిస్టేబుల్ అప్పన్న నాగార్జున యూనివర్శిటీలో జరిగిన పోలీసు సెలెక్షన్ ట్రైల్స్‌లో పవర్‌లిఫ్టింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిమ్‌లో గురువారం అప్పన్నను అల్లాడ వెంకటరమణ, మట్టపర్తి వెంకటసముద్రం, ముత్తాబత్తుల వెంకటరమణ, తిక్కా మురళీ, కట్టా బుజ్జి, వాకపల్లి దొరబాబు, పిల్లి వందన తదితరులు జిమ్‌కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మన్ కామన



సమావేశంలో మాట్లాడుతున్న కామన ప్రభాకర్‌రావు

కాకినాడ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మన్ కామన ప్రభాకరరావు కోరారు. కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కిసాన్ సెల్ జిల్లా సమావేశం డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభాకరరావు మాట్లాడుతూ తాము రైతులకు అండగా ఉంటామన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు సత్యానందరావు, ఏఐసీసీ సభ్యుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా వెంకటప్రసాద్, డీసీసీ అధికార ప్రతినిధి మారోతి శివగణేష్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు ప్రసంగించారు. కిసాన్ సెల్ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా కాకినాడ విచ్చేసిన ప్రభాకరరా వును సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, పీసీసీ సభ్యుడు పోలిశెట్టి శ్రీనివాసరావు, నీరుకొండ సత్యనారాయణ, మేడిద శ్రీనివాసరావు, దవులూరి ధనకోటి, బావిశెట్టి సత్యనారాయణ, వనుం వెంకటరమణ, బత్తుల లలిత తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట-పవర ఫీడర్లో ట్రీ కటింగ్, మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ఏపీఎస్డీఎస్ ప్రభాకర్ తెలిపారు. మండలంలోని ఉండూరు, గొంచాల, పి.వేమవరం, కాపవరం, బ్రహ్మానందపురం, రావువారిచంద్రంపాలెం, నవర, పవర గ్రామాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



కాకినాడ జేఎన్టీయూలో వన మహోత్సవంలో పాల్గొన్న ఉప కులపతి ప్రసాద్



కాకినాడ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే నానాజీ



కాకినాడ జీజీహెచ్‌లో మొక్క నాటి నీరు పోస్తున్న సూపరింటెండెంట్ లావణ్య

ఘనంగా పర్యావరణ దినోత్సవం

కాకినాడ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వన మహోత్సవంలో భాగంగా 29వ డివిజన్ సంత చెరువు పార్కులో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మొక్కలు నాటారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కమిషనరు భావన, టీడీపీ నగర శాఖ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు గదుల సాయిబాబు, అమలకంటి బలరామ్, రెడ్నం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): ఒక మొక్క-ఒక శ్వాస నినాదంతో జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి మొక్కలు నాటారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ పద్మనాభన్‌శ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ రాజ్‌కుమారి, డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ వి.వరప్రసాద్, ఏఆర్ఎంవో డాక్టర్ లావణ్య, డాక్టర్ యమున, పాలపర్తి మూర్తిబాబు, పేపకాయల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ ప్రాంగణంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత, డాక్టర్ అరుణ, డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ విల్సన్, డెమో ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకే (ఆంధ్రజ్యోతి): అధిక సంఖ్యలో మొక్కలు నాటి జేఎన్టీయూని గ్రీన్ క్యాంపస్‌గా మార్చాలని ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ కోరారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, వన్ స్టెప్ సంయుక్త ఆధ్వర్యంలో అలూమ్ని ఆడిటోరియం వద్ద ఉన్న లాన్‌లో వన మహోత్సవం నిర్వహించారు. వీసీ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. రెక్టార్ కేవీ రమణ, ఓఎస్డీ కోటేశ్వరరావు, మాజీ వైస్ చాన్సలర్లు జీవీఆర్ ప్రసాదరాజు, కేవీఎస్‌జీ మురళీకృష్ణ, పద్మరాజు, డైరెక్టర్లు కృష్ణప్రసాద్, పద్మజారాణి, కృష్ణ, కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.మల్లవరంలో సర్పంచ్ పంపన రామకృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, టీడీపీ నేతలు గుత్తుల వెంకటరమణ, ధూళిపూడి వెంకటరమణ, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, న్యాయవాదులు అనిశెట్టి కాశీవిశ్వనాథరెడ్డి, ఎస్ఎం ఆలీ, బత్తిన లక్ష్మణదొర, డి.కిరణ్, సరిదే నాగేశ్వరరావు, సత్యవాణి, రమేష్‌బాబు, కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు. పాతబస్టాండు వద్ద గల పాడా కార్యాలయ ఆవరణలో పీడీ చైత్రవర్షిణి, ఏపీడీ వసంతమాధవి, సిబ్బంది మొక్కలు నాటారు. పాల్గొన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో 1,422 మొక్కలు నాటే కార్యక్రమానికి కమిషనరు నామ కనకారావు శ్రీకారం చుట్టారు.

మనకు స్వచ్ఛమైన గాలి అందాలంటే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా భావించి ప్రతి ఒక్కరూ కనీసం మూడు మొక్కలు నాటాలని విశ్వవిజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా సూచించారు. పట్టణంలోని సెంట్రల్ డివైడర్‌లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ ర్యాలీని ప్రారంభించారు. మునిసిపల్ కమిషనరు కనకారావు, గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, చెల్లుబోయిన సతీష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, ట్రస్టు సభ్యులు పేరూరి సూరిబాబు, ఏవీవీ సత్యనారాయణ, ఎన్టీవీ ప్రసాదవర్మ, ఆర్కే శివరామకృష్ణన్, సానబోయిన కృష్ణకుమార్, అల్లవరపు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాలిపేటలోని బాలికోన్నత పాఠశాల ఆవరణలో డీఈవో పి.రమేష్ మొక్కలు నాటారు. ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు భాగస్వాములై పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటాలని సూచించారు. డీవైఈవో ఎన్.వెంకటేశ్వరరావు, ఏసీఈ రాజశేఖర్ పాల్గొన్నారు. కాకినాడ రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో పి.సతీష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మితో కలిసి మొక్కలు నాటారు. జనసైనికులు శిరంగు శ్రీనివాసరావు, పాండ్రంకి రాజు, త్రిమూర్తులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత అని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు అన్నారు. గురువారం ఆయన ఏడీబీ రోడ్డులో మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనరు కె.శ్రీకాంత్, డీఈ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ గొల్లప్రోలులో ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ కమిషనరు కనకారావు, అధికారులు, వార్డు సచివాలయాల సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను దత్తత తీసుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్, జీజీహెచ్ డైరెక్టర్ రావు అక్షయ్ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వారు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈవోపీఆర్డీ సత్యారెడ్డి, సూపరింటెండెంట్ చలమయ్య, జూనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు గింజాల శ్రీనివాస్, బత్తిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సత్యనారాయణపురం ఏడీబీ రోడ్డు నుంచి ఎఫ్‌సీఐ గోదాముల వరకు మున్సిపల్ కమిషనరు శ్రీవిద్య ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ, మేనేజరు కనకరాజు, ఏఈ నరసింహారావు, టీడీపీ, జనసేన నాయకులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది మొక్కలు నాటి నీళ్లు పోశారు.



కాకినాడ సంతచెరువు పార్కులో మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే కొండబాబు



పిఠాపురంలోని కోర్టుల ప్రాంగణంలో మొక్కకు నీరు పోస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు



కాకినాడలో మొక్క నాటుతున్న డీఈవో రమేష్



కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో...



తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో...



పెద్దాపురంలో మొక్క నాటుతున్న సూరిబాబురాజు



కొత్తపల్లిలో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ



పిఠాపురంలో మొక్క నాటుతున్న డాక్టర్ ఉమర్ ఆలీషా, జనసేన నేత శ్రీనివాసరావు



గొల్లప్రోలులో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, కూటమి నాయకులు



సామర్లకోటలో మొక్క నాటుతున్న కమిషనరు శ్రీవిద్య



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కొత్తపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ, అమీనబాద్ గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ గురువారం అందజేశారు. తొలుత అమరవల్లిలో నూతనంగా నిర్మించిన ఉండ్రాళమ్మ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. మూలపేటలో టీడీపీ కార్యకర్త పిల్లి కాశియ్య కుమారుడు ఏర్పాటుచేసిన రక్త పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. పలువురు టీడీపీ నాయకులు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభ అవార్డుకు జయలక్ష్మి ఎంపిక



గొల్లప్రోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన వడ్లమూరి జయలక్ష్మి సీఈసీ గ్రూపులో 939 మార్కులు సాధించి ప్రభుత్వ కళాశాలల్లో కాకినాడ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆమెను ప్రతిభ అవార్డుకు ఎంపిక చేస్తున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి సమాచారం వచ్చింది. అమరావతిలో జరిగే కార్యక్రమంలో జయలక్ష్మికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రూ.20వేల నగదు పురస్కారం, అవార్డు అందజేయనున్నారు. జయలక్ష్మిని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నీతిపూడి గోవిందు, అధ్యాపకులు అభినందించారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాల తనిఖీ

ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ సీజ్

గొల్లప్రోలు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తి శివారులోని పోలవరం, పుష్కర కాలువ గట్లపై జరుగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై గురువారం తెల్లవారుజామున రెవెన్యూ, పోలీసు అధికారులు తనిఖీలు చేపట్టారు. తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను చెందుర్తి వీఆర్వో దొండపాటి చంటిబాబు, సిబ్బంది స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. ఎక్స్‌కవేటర్ డ్రైవర్ లోండా శంకర్, ట్రాక్టర్ డ్రైవర్ ఇంతిపల్లి జ్యోతిబాబులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాటిపర్తి స్వామి ఆధ్వర్యంలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్టు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

'విత్తనాలు, ఎరువుల విక్రయంలో నిబంధనలు పాటించాలి'

పిఠాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు, ఎరువులు విక్రయాల్లో నిబంధనలు పాటించాలని, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి హెచ్చరించారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి పట్టణాలు, మండలాల పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లతో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. విత్తనాల మొలక శాతాన్ని పరీక్షించి 80శాతం కంటే అధికంగా ఉంటేనే విక్రయాలు జరపాలని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన స్టాకులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. తమ వద్ద ఉన్న విత్తనాలు, ఎరువుల నిల్వల వివరాలను అందుబాటులో ఉంచడంతో పాటు షాపుల వద్ద ప్రదర్శించాలని, ప్రతి అమ్మకానికీ బిల్లు ఇవ్వాలని కోరారు. పిఠాపురం, కొత్తపల్లి మండలాల వ్యవసాయాధికారులు అచ్యుతరావు, జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

అసోసియేట్ కస్టమర్ కేర్ కోర్సులకు ఉచిత శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అసోసియేట్ కస్టమర్ కేర్ (వాయిస్ అండ్ నాన్-వాయిస్) కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తామని జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఏదైనా డిగ్రీ, డిప్లొమా చదివి 18 నుంచి 30 సంవత్సరాలలోపు వారు అర్హులు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 8639846568 నంబరును సంప్రదించాలి.



సామర్లకోటలో స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి


'విద్యార్థి మిత్ర కిట్లను పారదర్శకంగా పంపిణీ చేయాలి'

సామర్లకోట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌లను పారదర్శకంగా పంపిణీ చేయాలని అడల్ట్ ఎడ్యుకేషన్ రాష్ట్ర డైరెక్టర్, జిల్లా నోడల్ అధికారి బి.ప్రతాప్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన పట్టణంలోని విద్యామిత్ర స్టాక్ పాయింట్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. మండలంలోని విద్యార్థుల వివరాలు, ఇప్పటి వరకు ప్రభుత్వం సరఫరా చేసిన కిట్‌ల సమాచారాన్ని ఎంఈవో పట్టపగలు పుల్లయ్య వివరించారు. నిర్వహణ తీరు బాగుందని అభినందించారు. సమగ్ర శిక్షా సీఎంవో చామంతి నాగేశ్వరరావు, ఏఎస్వో జోగిరెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): అడల్ట్ ఎడ్యుకేషన్ రాష్ట్ర డైరెక్టర్, జిల్లా నోడల్ అధికారి బి.ప్రతాప్‌రెడ్డి గురువారం పెద్దాపురం మండల స్టాక్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పరిశీలించారు. అన్ని పాఠశాలలకు సరఫరా చేశారా లేదా పరిశీలన చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. చౌదరి, సమగ్ర శిక్షా సీఎంవో చామంతి నాగేశ్వరావు, ఏఎస్‌వో జోగిరెడ్డి, కార్యాలయ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

'మామిడికి మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి'

పెద్దాపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మామిడికాయల ధరల పతనంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, దళారుల దోపిడీ అరికట్టాలని, మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వేములవారి సెంటర్ వెంకన్నబాబు గుడి సమీపంలో గురువారం రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నకుల వీరాంజనేయులు మాట్లాడుతూ భవిష్యత్తులో మామిడి రైతుల కోసం కోల్డ్ స్టోరేజీలు కట్టించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజాబాబు, నాయకులు దేశెట్టి సురేష్, సుంకర శ్రీనివాస్, సిగిరెడ్డి త్రిమూర్తులు, కోట వీరబాబు, మాన అన్నవరం, మాదాపు అబ్బు తదితరులు పాల్గొన్నారు.



రక్షిత నీటి పథకాన్ని తనిఖీ చేస్తున్న కమిషనరు కనకరావు

తాగునీటి శాంపిల్స్‌ను పరీక్షలకు పంపుతాం

గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనరు కనకరావు

గొల్లప్రోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగు నీటి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలకు పంపుతామని నగర పంచాయతీ కమిషనరు కనకారావు తెలిపారు. 'కుళాయిల ద్వారా కలుషిత జలాలు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని తనిఖీ చేశారు. ఫిల్టర్‌బెడ్‌ల పనితీరు పరిశీలించారు. ఏలేరులో కలుషిత జలాలు వస్తున్న నేపథ్యంలో వాటి వినియోగాన్ని నిలిపివేసి తాటిపర్తి బోర్ల ద్వారానే వచ్చే నీటినే కుళాయిల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. పైపులైన్లకు లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. కమిషనరు వెంట నగర పంచాయతీ ఏఈ ప్రభాకర్ వున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం

కాకినాడ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలంలో గోదావరిలో దిగి మృతి చెందిన నగరానికి చెందిన సబ్బిత క్రాంతికిరణ్, సబ్బిత పాల్‌అభిషేక్ తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.4లక్షల ఆర్థిక సహాయం చెక్కును ఎమ్మెల్యే వనమాడి కొండబాబు గురువారం వారి నివాసంలో అందజేశారు. జగన్నాథపురం యాళ్లవారి గరువులో జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కాకినాడ అర్బన్ డిప్యూటీ తహసీల్దారు వి.కృష్ణకుమారి, ఆర్ఐ బత్తిన రాజు, మల్లిపూడి వీరు, పలివెల రవిఅనంతకుమార్, చింతపల్లి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఇదే ప్రమాదంలో మృతి చెందిన కరప మండలం గురజనాపల్లికి చెందిన తాతపూడి నితీష్‌కుమార్ కుటుంబానికి రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే పంతం నానాజీ అందజేశారు.

కాలేజీ ఆధునికీకరణ పనుల పరిశీలన

కిర్లంపూడి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ఆదేశాలతో కిర్లంపూడి జూనియర్ కళాశాల ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.7.50లక్షల నిధులు మంజూరు చేసినట్టు కిర్లంపూడి ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ల బాబులు తెలిపారు. కాలేజీలో జరుగుతున్న ఆధునికీకరణ పనులను తోట రవి, సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు పరిశీలించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



రంపచోడవరంలో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

వన మహోత్సవంలో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి పిలుపు

రంపచోడవరం/గంగవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవంలో సందర్భంగా వన మహోత్సవంలో భాగంగా గంగవరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆమె ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, డీఎఫ్‌వో రవీంద్రధామ, ఎస్‌డీపీవో సాయిప్రశాంత్, సబ్ డీఎఫ్‌వో అనూషలతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లాల కృష్ణారెడ్డి, ఎఫ్ఆర్‌వో జేవీ సుబ్బారెడ్డి, జీసీసీ డీఎం పార్వతీశ్వరరావు, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, నాయకుడు పాము అర్జున, ఎఫ్ఎస్‌వోలు అప్పారావు, నూకరాజుదొర పాల్గొన్నారు. ముసురుమిల్లి ఆశ్రమ పాఠశాల ఆవరణలో సర్పంచ్ కోసు రమేష్‌బాబుదొర, ఎంపీటీసీ కుంజం వంశీకృష్ణ మొక్కలు నాటారు. హెచ్ఎం ఆదివిష్ణు, వార్డెన్ విజయ, అటవీ శాఖ అధికారులు వీరయ్యదొర, బాపిరాజు, బొబ్బా శేఖర్, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, హెచ్‌డబ్ల్యూసీ ప్రవల్లిక పాల్గొన్నారు.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు-1 ఏనుగులుగూడెం ఆర్అండ్ఆర్ కాలనీలో వన మహోత్సవం నిర్వహించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వ అధికారులు, జనసేన మండల అధ్యక్షుడు శారపు వెంకటరాయడు, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి, కూటమి నాయకులు కందికొండ గౌరీశ్వరి, ముచ్చు వీరవెంకట సత్యనారాయణ, నాగేశ్వరరావు, త్రిమూర్తులు మొక్కలు నాటారు. పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కారం సుబ్బారావు, సీఐ ఎం.కన్నపరాజు మొక్కలు నాటారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, టీడీపీ నాయకుడు పాటి చలపతి, ఎంపీపీ కాక కామేశ్వరి, ఎంఈవో రాజులు, సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఉపసర్పంచ్ కందుకూరి స్వర్ణ పాల్గొన్నారు.

చింతూరు (ఆంధ్రజ్యోతి): గిరిజన బాలికోన్నత పాఠశాలలో చింతూరు డీఎఫ్‌వో ఎం.బబిత, జేకే చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జమాల్‌ఖాన్ మొక్కలు నాటి వాటి ఆవశ్యకతను వివరించారు. అటవీ శాఖ అధికారులు ఆజాద్, అబ్బయ్యదొర, శ్రీనివాస్, సరిత, కుమారి, నాగార్జున, శివచంద్ర, హెచ్ఎం పావని, టీడీపీ నాయకులు ఎండీ జహంగీర్, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.



దేవీపట్నం మండలం ఇందుకూరు-1లో



చింతూరులో...



ఎటపాకలో...

పోలవరం నిర్వాసితులకు భూ సేకరణ





ఏలూరు జిల్లా జీలుగుమిల్లిలో కూనవరం మండలం కొండ్రాజుపేట నిర్వాసితులకు స్థలం చూపిస్తున్న చింతూరు ఐటీడీఏ పివో అపూర్వభరత్, గోకవరం మండలం జగన్నాథపురంలో పునరావాస స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు, నిర్వాసితులు

కూనవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రాజుపేట పోలవరం నిర్వాసితులను చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ గురువారం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి తీసుకెళ్లారు. వ్యవసాయ భూమి కోల్పోయిన వారికి భూమికి భూమితో పాటు నివాసం ఉండేందుకు స్థలం కూడా చూపించారు. 130 కుటుంబాల నిర్వాసితులకు ఈ ప్రాంతంలో ఇళ్లు కట్టనున్నారు. భూ సేకరణపై సంతృప్తి చెందినట్టు కొండ్రాజుపేటకు చెందిన పాయం రంగమ్మ చెప్పింది.

చింతూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చింతూరులో నివసిస్తున్న దాదాపు 1,500 మంది గిరిజనేతర నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో గురువారం పలువురు నిర్వాసితులను రెండు బస్సుల్లో గోకవరం మండలం జగన్నాథపురం తీసుకెళ్లి నివాసయోగ్యమైన స్థలాలను చూపించారు. దీనిపై నిర్వాసితుల అభిప్రాయం మేరకు తదుపరి చర్యలు చేపడతారు.

అలుగు వాగు కాల్వ, కల్వర్టు పునర్నిర్మాణానికి చర్యలు

ఎటపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అలుగు వాగు ప్రాజెక్టు కుడి కాల్వ వర్షాభావ పరిస్థితుల కారణంగా గండ్లుపడి, దెబ్బతిందని గిరిజన రైతులు ఇటీవల ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గురువారం ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పరిశీలించారు. గండ్లకు మరమ్మతులు చేసి ప్రాజెక్టులో నీరు దిగువకు వృథాగా ప్రవహించకుండా చర్యలు చేపడితే అనేక గ్రామాల రైతులకు సాగు నీరు అందుతుందని వారు పీవో దృష్టికి తెచ్చారు. సీతాపురం-గొల్లగూడెం దారిలో గతంలో వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు ప్రదేశాన్ని పీవో పరిశీలించారు. వెంటనే మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలుగువాగు కుడి కాల్వ మరమ్మతులతో పాటు ప్రాజెక్టులో నీరు నిల్వ ఉండేందుకు చర్యలు చేపడతామని రైతులకు హామీ ఇచ్చారు. టీపీవీడు సర్పంచ్ మోసం రాజులు, టీడీపీ సీనియర్ నాయకుడు పూరేటి వెంకటేశ్వరరావు, తోటపల్లి సర్పంచ్ మోసం దుర్గాలక్ష్మి, బాచినేని మల్లేశ్వరరావు, దుద్దుకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సుకుమామిడిలో పారిశుధ్య పనులు

మోతుగూడెం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం కొత్తపల్లి పంచాయతీ సుకుమామిడిలో చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ ఆదేశాల మేరకు ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో సెక్రటరీ జి.మోహన్ పర్యవేక్షణలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామంలో విష జ్వరాలు ప్రబలాయి. వర్షాకాలం ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పంచాయతీ సిబ్బంది ఊరంతా బ్లీచింగ్ పిచికారీ చేశారు.

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

ఎటపాక, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపట్నం రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజైన గురువారం మంగళ తోరణాల అలంకరణ, పంచపల్లవ తోరణాల అలంకరణ, యాగ ప్రవేశం, గణపతి పూజ, యాగం, విగ్రహాలకు జలాభిషేకం, బైండ్ల పూజారుల దిష్టితీయుట నిర్వహించారు.

ఇంటింటికీ చెత్త బుట్టలు పంపిణీ

కూనవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కూనవరంలో ఇంటింటికీ చెత్త బుట్టలు పంపిణీ చేశారు. చెత్తను బయటపడేయకుండా పంచాయతీ సిబ్బంది తెచ్చే వాహనాల్లోనే వేయాలని ప్రజలకు సూచించారు. ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్, ఈవో సురేష్, చలకాని ఉమ, బరపాటి ప్రకాష్, గడ్డిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.







మొక్కలు నాటుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎస్.అన్నవరంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే దివ్య సింగరంపాలెంలో మొక్క నాటుతున్న మోహనరావు

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

● ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



ఏలేశ్వరం పట్టణంలో మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి నేతృత్వంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పలుచోట్ల మొక్కలు నాటి, బాలాజీ చౌక్ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేశారు. నగర పంచాయతీ కమీషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జ్యోతుల పెదబాబు తదితరులతో పాటు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పర్యావరణ పరిరక్షణ

పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి అవసరమని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో మొక్కలు నాటి, ర్యాలీ నిర్వహించారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు పలు గ్రామాల్లో పర్యావరణంపై అవగాహన ర్యాలి చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పెంపొందించాలి

అన్నవరం: కాలుష్య రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పెంపొందించాలని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు అన్నారు. గురువారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేవస్థానం పరిసరాల్లో మొక్కలు నాటారు. ఏఈ వో కొండలరావు, పీఆర్‌వో కృష్ణారావు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

శంఖవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ బాబీ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కత్తిపూడి ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: మండలంలోని సింగరంపాలెం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు అక్కిన నాగేశ్వరరావు, సుదర్శనరావు ఉన్నారు. గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజమనోహర్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఏవో కె.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు. గండేపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, సిబ్బంది మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

జగ్గంపేట: మండలంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా టీడీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్, జగ్గంపేట, సత్యవేణిపేటలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎ స్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం తదితరులతో పాటు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీవో భాస్కర్, కొండ్రోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● రాజపూడిలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉపాధి అధికారులు సిబ్బందితో పాటు కూటమి నాయకులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు రేఖ బుల్‌రాజు తదితరులు మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడితే మనమంతా బాగుంటామని వక్తలన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

రౌతులపూడి: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్య భాస్కరరావు, పైల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

కోటనందూరు: పర్యావరణ పరిరక్షణపై ఉద్యానశాఖ రైతులకు అవగాహన కల్పించింది. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, ఉద్యానశాఖ కేవో మల్లవరంలో గాడి రాజుబాబు పొలంలో ఆయిల్‌పామ్ కొత్త ప్లాంటేషన్ వేశారు. పర్యావరణ పరిరక్షణ దిశగా రైతులను ప్రోత్సహించడం జరుగుతుందని, ఆయిల్ పామ్ పంట రాయితీలు, పంట లాభాలు రైతులుకు వివరించారు.

జగ్గంపేట: ఎస్పీ బిందు మాదవ్, ఏపీవో కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో పోలీసులు పాలుపంచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి పోలీసులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

ప్రకృతిని కాపాడుకోవాలి

తొండంగి: ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎంపీడీవో రాజేశ్వర్రావు అన్నారు. గురువారం ఆయన వనమహోత్సవంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ సోమాల ప్రసాద్, నేమాల కృష్ణతో పాటు వివిధ గ్రామాల కార్యదర్శిలు రాజబాబు, ప్రేమ్ కుమార్, మధు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని కిర్లంపూడిలో నిర్వహించారు. ఎంపీడీవో హరికృష్ణ ఆధ్వర్యంతో మొక్కలు నాటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎంపీపీ తోట రవి, తోట గాంధీ విచ్చేశారు. కిర్లంపూడి జూనియర్ కళాశాల మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. సుమారు 19 గ్రామ పంచాయతీలో 1900 మొక్కలు పంపిణీ చేసినట్లు ఏపీవో నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, కుర్ల చినబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో పర్యావరణ దినోత్సవం

ప్రత్తిపాడు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడు కోర్టు ఆవరణలో గురువారం మండల లీగల్ సర్వీసెల్ కమిటీ చైర్మన్, జడ్జి ఎల్.గోపినాథ్ మొక్కలు నాటారు. పెదశంకర్లపూడి గ్రామంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రైతు వరుపుల రామకృష్ణ భూమిలో పామాయిల్ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానశాఖ అధికారి కె.శ్రీవల్లి, ఏపీ ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎన్.హేమలత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● ప్రభుత్వ విప్ యనమల దివ్య

తునిరూరల్: పర్యావరణ పరిరక్షణతో మనిషి మనుగడ సాధ్యమవుతుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్.అన్నవరం కోటమి చెరువు గట్టుపై మొక్కలునాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటాలని తెలిపారు. కార్యక్రమంలో తుని నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు తదితరులతో పాటు మున్సిపల్ చైర్పర్సన్ నార్ల భువన సుందరి, టీడీపీ పట్టణ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త చోడిశెట్టి గణేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

● సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను యనమల దివ్య తుని పట్టణ, రూరల్, తొండంగి, కోటనందూరు మండలాలకు సంబంధించి 20 మందికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ 20 మంది కుటుంబాలకు సంబంధించి రూ.17,51,715 నగదు చెక్కును అందజేశామన్నారు. కార్యక్రమంలో మళ్ళ గణేష్, గాడి రాజబాబు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సమావేశానికి తరలిన ఉద్యోగులు

గండేపల్లి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్రస్థాయి 3వ కౌన్సిల్ సమావేశానికి గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల నుంచి అన్ని శాఖల ఉద్యోగులు, సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు గురువారం తరలివెళ్లారు. కార్యక్రమంలో జగ్గంపేట యూనిట్ ప్రెసిడెంట్ కెవిఆర్ ఫణీంద్రకుమార్, జనరల్ సెక్రటరీ కె.ప్రసాద్ తదితరులతో పాటు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



గండేపల్లి నుంచి విజయవాడ వెళుతున్న ఉద్యోగులు

టీడీపీ నాయకులకు యనమల పరామర్శ

కోటనందూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం గ్రామంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణ గురువారం పర్యటించారు. టీడీపీ సీనియర్ నాయకులు పల్లి అప్పలనాయుడు అస్వస్థతకు గురికాగా యనమల పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన పల్లి వెంకటరమణ, ఇటీవల అనారోగ్యంతో భార్యను కోల్పోయిన మాతిరెడ్డి బాబులు కుటుంబాన్ని పరామర్శించారు. ఈయన వెంట గాడి రాజుబాబు, చింతమనేని అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



అప్పలనాయుడును పరామర్శిస్తున్న యనమల

మోడల్ స్కూల్లో సీట్ల భర్తీకి రిజిస్ట్రేషన్లు ప్రారంభం

తుని రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హంసవరం ఏపీ మోడల్ స్కూల్లో సీట్ల భర్తీకి రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయినట్లు ప్రిన్సిపాల్ పి.పద్మజ తెలిపారు. 7, 8, 9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ ఆన్‌లైన్‌లో రోస్టర్ పాయింట్లు ఆధారంగా జరుగుతుందని ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. వివరాలకు మోడల్ స్కూల్ పాఠశాల వెబ్‌సైట్ ను సందర్శించాలని ఆమె కోరారు.

యోగాతో మానసిక ప్రశాంతత

తునిరూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకురాలు వి.కొత్తూరు మాజీ సర్పంచ్ తమరాన వరలక్ష్మి తెలిపారు యోగాంధ్ర వేడుకలను పురస్కరించుకుని వి.కొత్తూరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు.



వి.కొత్తూరులో మొక్కలు నాటుతున్న వరలక్ష్మి

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆందోళన

ఏలేశ్వరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన జరిపారు. గురువారం మండలంలోని చిన్నింపేట గ్రామంలో విద్యుత్ సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వేగు వెంకట రమణ, జి.రమణ, పి.వినయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఏఈ సూర్యనారాయణకు వారు వినతిపత్రం అందజేశారు.

బాలికా విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం

● తుని ఎమ్మెల్యే దివ్య

తొండంగి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బాలికా విద్యకు ప్రాధాన్యం ఇస్తోందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. గురువారం వాకదారి పేట కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం (కెజిబివి)లో నిర్మించనున్న ఇంటర్మీడియట్ బ్లాక్ భవనాలకు ఆమె శంకుస్థాపన చేసారు. అనంతరం ఆమె వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యనమల రాజేష్, కొయ్యా శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌దాడులు

ప్రత్తిపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లో గురువారం ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. మండలంలోని టి.రాయవరం గ్రామంలో సూరంపూడి రాఘవ అనే మహిళను సారాతో ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. కిర్లంపూడి గ్రామంలో మాదిబోయిన దుర్గాప్రసాద్ వద్ద సారాను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి ఇద్దరిని కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని స్థానిక ఎస్ఐ టి.శివప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.వంశీరామ్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

కాపుల గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

● ఎమ్మెల్యే జ్యోతుల

జగ్గంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తుని రైలు దగ్ధం కేసు అప్పీల్‌ను ప్రభుత్వం రద్దు చేసినట్లు జ్యోతుల నెహ్రూ తెలిపారు. వైసీపీ ప్రభుత్వం తన పాలనలో కాపులపై కపట ప్రేమ కురిపించిందని దుయ్యబట్టారు. జిల్లాలో నలుగురు మంత్రులు వైసీపీలో ఉండి కాపులపై జగన్ అరాచకాలను చూస్తూ ఉండిపోయారే తప్ప కాపులకు అండగా నిలబడింది లేదని ఎద్దేవా చేశారు. కాపులకు సంబంధించి ఒక్క మంచి పని అయినా జగన్ చేశాడా అని అన్నారు. కాపుల గురించి మాట్లాడే హక్కు వైసీపీకి కానీ, ఆ పార్టీ నాయకులకు కానీ లేదని జ్యోతుల నెహ్రూ అన్నారు. కార్యక్రమంలో ఎస్‌వి అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, అడపా తాతాజీ, ఉప్పలపాటి బుల్లబ్బు పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకోలేనిది

● మాజీ మంత్రి ముద్రగడ

ప్రత్తిపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని జీవితాంతం తమ కుటుంబం వారికి రుణపడి ఉంటుందని మాజీ మంత్రి పీఏసీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం తెలిపారు. ప్రత్తిపాడులో వెన్నుపోటు దినం కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు వచ్చి విజయవంతం చేయడాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం గురువారం నియోజకవర్గీయులకు లేఖరాసి ధన్యవాదాలు తెలిపారు ప్రజల సేవకు బద్దులై ఉంటానని ఆ లేఖలో ముద్రగడ తెలిపారు.

రేపు సత్యనారాయణస్వామి కల్యాణం



అనంతలక్ష్మి సత్యనారాయణస్వామి

ఏలేశ్వరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోనున్న అనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి వార్షిక కల్యాణం 7న అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు గురువారం పురోహితుడు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, కుమార్తెను చేయనున్నామని, 7న స్వామి వారి కల్యాణం, 8న గ్రామోత్సవం, 9న సద్యసం, పండిత సత్కారం, 10న విశేష అర్చన, 11న పూర్ణాహుతి, చక్రస్నానం, 12న ద్వాదశ ప్రదక్షణ, 13న అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో కొత్త గ్రూపులు

ఏలేశ్వరం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎమ్ఎల్‌టి) గ్రూపును ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి ఎమ్ఎల్‌టి కోర్సును ప్రారంభిస్తున్నామన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎమ్‌సీహెచ్‌డబ్ల్యూ గ్రూపులతో పాటు ఎమ్ఎల్‌టి కోర్సుకి అడ్మిషన్లు జరుగుతున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జగ్గంపేట రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట గ్రామ శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన కురుకూరి అబ్బులు, కుమారుడితో కలిసి జగ్గంపేట నుంచి మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొంది. దీంతో అబ్బులు బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ అబ్బులు కాలుపై నుంచి దూసుకుపోయింది. దీంతో తీవ్ర గాయాలైన అతన్ని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.